
హార్బర్‌లో జట్టీకి చేరిన బోట్లు

నిజాంపట్నం హార్బర్‌లో.. 3వనెంబర్ ప్రమాదసూచిక

రేపల్లె,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం 3వనెంబర్ ప్రమాదసూచిక కొనసాగుతోంది. వేటకు వెళ్ళిన బోట్లన్నీ తిరిగి రావాలని వైర్‌లెస్‌సెట్ల ద్వారా అధికారులు ఆదేశాలు జారీచేశారు. సముద్రంలో అలల ఉధృతి అల్లకల్లోలంగా ఉండటంతో వాతావరణంలో చలితో కూడిన ఈదురు గాలులు వీస్తుండడంతో మత్స్యకారులంతా హార్బర్‌కు చేరుకున్నారు. వేటకు వెళ్ళిన బోట్లన్నీ జట్టీలకు పరిమితమయ్యాయి.


చీరాల: లూథరన్ ఎయిడెడ్ కళాశాలలో అధ్వానంగా ఉన్న ఆటస్థలం


రేపల్లె: జూనియర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పూర్తికాని పనులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

క్రీడల్

విద్యార్థులకు ఆటలు అవసరం..

శారీరక, మానసిక, దేహ దారుఢ్యానికి క్రీడలు దోహద పడతాయి.. అయితే జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సరైన క్రీడా మైదానాలు, వసతులు లేవు. ఆట స్థలాలు ఉన్న దగ్గర్ల పీడీలు లేరు.. పీడీలు ఉన్న కళాశాలలకు మైదానాలు లేవు. ఉన్నా కొన్ని ప్రాంతాల్లో గుంతలు, పిచ్చిచెట్లతో నిండి ఉన్నాయి. ఇంటర్‌మీడియట్ జూనియర్, సీనియర్ విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా.. వారిని ప్రోత్సహించే పరిస్థితి లేదు. మొత్తంమీద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ఆర్బాటంగా ప్రకటనలు చేశారే తప్ప అందుకు అనుగుణంగా పరిస్థితులను కల్పించడంలో నాటి పాలకులు విఫలమయ్యారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించేందుకు చర్యలకు ఉపక్రమించింది. క్రీడా కోటా కింద మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాల దుస్థితి, వసతులపై ఆంధ్రజ్యోతి బృందం ప్రత్యేక కథనం.

- ఆటలు లేని కళాశాలలు
- మైదానాలున్న దగ్గర్ల అధ్వానం
- క్రీడా మైదానాల అభివృద్ధికి చెల్లుచీటి
- కొన్ని కాలేజీల్లో భర్తీ కాని పీడీ పోస్టులు
- క్రీడలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు
- జూనియర్ కళాశాలల్లో క్రీడా సౌకర్యాలు కరువు
- గత ఐదేళ్లు ఒక్కపైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- రేపల్లె కళాశాలలో రెండేళ్లుగా పూర్తికాని ఇండోర్ స్టేడియం
- 3 శాతం స్పోర్ట్స్ కోటా సరే.. సౌకర్యాలు కల్పించాలంటున్న విద్యార్థులు


చీరాల వైఏ మహిళ కళాశాలలో అధ్వానంగా ఉన్న ఆటస్థలం


బాపట్ల: సూర్యలంక రోడ్డులో క్రీడాప్రాంగణం లేని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 22: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21, బాపట్ల జిల్లాలోని చీరాల పరిధిలో నాలుగు వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులున్నారు. అయితే చాలా కళాశాలల్లో క్రీడా మైదానాలే లేవు. అనేక జూనియర్ కళాశాలల్లో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని కళాశాల్లో అయితే ఏళ్ల తరబడి పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సరైన ఆటస్థలం లేదంటే ఇక మండలాల్లోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించిన గత పాలకులు ఆ స్థాయిలో ఆట స్థలాలను ఏర్పాటు చేయలేదు. పీడీ పోస్టుల భర్తీ, ఆటల పరికరాలు, నిధులను మంజూరు చేయలేదు. అంతంతమాత్రం వసతులతోనే చాలా ప్రాంతాల్లో జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు.

ఇక క్రీడ మైదానాలు ఏర్పాటు చేయటం సాధ్యపడే పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ఆటస్థలాలు అధ్వానంగా మారాయి. ఆటల పరికరాలు విద్యార్థులకు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు దీంతో ఆసక్తి ఉన్న విద్యార్థులు కూడా ఆటల్లో వెనుకబడుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ప్రైవేటుగా శిక్షణ తీసుకోవాలంటే ఖర్చుతో కూడుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి క్రీడలకు అనువైన వాతావరణం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

- బాపట్ల సూర్యలంకరోడ్డులో సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను 1972లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రీడా మైదానం లేదు. బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే జూనియర్ కళాశాలతో పాటు 2014లో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉన్న స్థలం మొత్తం భవన నిర్మాణాలకు సరిపోయింది. క్రీడలకు స్థలం లేకుండా పోయింది. అంజనేయ అగ్రహారం మున్సిపల్ పాఠశాల భవనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను

(మిగతా 7వ పేజీలో)

ఆటలపై అలక్ష్యం..

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా జూనియర్ కళాశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ప్రభుత్వం నిర్వహించలేదు. ఆటలకు అవకాశమే ఇవ్వలేదు. అసలు ఆటల అంశాన్నే వైసీపీ ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికారులు ఆలోచన చేయలేదు. క్రీడా పరికరాల కొనుగోళ్లకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆటలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని నాటి పాలకులు ఆర్భాటం చేశారు.. తప్ప కనీసం ఆట స్థలాలను కూడా మెరుగు పరచలేదు. ఉమ్మడి గుంటూ రు జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చినా 294 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు.


రేపల్లె: జూనియర్ కళాశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ మినీస్టేడియం


బాపట్ల పట్టణంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల భవనం

7

మండలిలో ఆలపాటి సేవలు అవసరం

- ఆయన్ని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పెమ్మసాని, జీవీ ఆంజనేయులు, బూర్ల రామాంజనేయులు, ఆలపాటి రాజేంద్ర ప్రసాదు తదితరులు

జీవాలపైకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

- 147 మృతి.. కాళ్లు విరిగిన మరో 50 జీవాలు
- దాచేపల్లిలో ఘటన.. రూ. 50 లక్షల నష్టం


జీవాల యజమానులకు న్యాయం చేయాలని రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న స్థానికులు

అడిగొప్పుల వాసికి గోల్డ్‌డిస్క్ అవార్డు

- చండీఘర్ డీజీపీ నుంచి సత్కారం అందుకున్న నరేష్‌కుమార్

ఏఎన్‌యూ ఖోఖో జట్టుకు 15 మంది ఎంపిక

మాఫియా మిలాఖత్


ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం

- ఇసుక మైనింగ్‌లో వైసీపీ, టీడీపీ నేతలు
- ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు
- చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నేత అనుచరుడు ఆర్ఆర్
- 150 టిప్పర్లు, 300 ట్రాక్టర్లలో నిత్యం తరలిపోతున్న ఇసుక

చీరాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియా.. టీడీపీ, వైసీపీ నేతలు మిలాఖత్.. జెండాలు వేరు, పార్టీలు వేరైనా చీరాల నియోజక వర్గంలో ఇసుక మాఫియా కలిసికట్టుగా రాజ్యమేలుతోంది. పెట్టుబడి లేని సంపాదనగా ఇసుక తవ్వకం, తరలింపు చేపడుతున్నారు. అధికార పార్టీ ముఖ్యనేత అనుచరుడు ఆర్ఆర్ ఇసుక దందాపై గుత్తాధిపత్యానికి పావులు కదిపాడు. పలువురిపై కేసులు నమోదు చేయించడంతో వైసీపీకి చెందిన కొందరు జెండాలు మార్చారు. కొందరు వైసీపీలో ఉంటూనే తమ భూములను ఆర్ఆర్‌కు అప్పజెప్తున్నారు. ట్రాక్టర్, టిప్పరుకు ఇంత అని లెక్క కట్టి భూయజమానులకు చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలో ఇసుకమాఫియా ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తోంది. వైసీపీ, టీడీపీ అనే భేదభావం లేకుండా రెండు పార్టీలకు చెందిన అక్రమార్కులు ఏకమై సహ జవనరుల దోపిడీని యథేచ్ఛగా సాగిస్తున్నారు. వైసీపీ పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా ఇసుక మాఫియా తీరు మారలేదని ప్రజలు మండిపడుతున్నారు. వైసీపీకి చెందిన పాత ముఖాలు, టీడీపీకి చెందిన కొత్త వారు కలిసి సాగిస్తున్న ఇసుక దందా కొత్త సీసాలో పాత సారాలా ఉందని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. 150 టిప్పర్లు, 300 ట్రాక్టర్లలో ఇసుక నిత్యం తరలిపోతున్నది. సుమారు రూ.అర కోటికిపైగా విలువైన ఇసుకను నిత్యం తరలిస్తున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నియమించిన మండల లెవల్ కమిటీలు కూడా పట్టించుకోలేదు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని కూటమి శ్రేణుల్లో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది.

ఫ్లెక్సీలు వేద్దాం.. పైసలు పోగేద్దాం

ఏ పార్టీ అయితే మనకేంటి. మనం కూడా పార్టీ మార్చేద్దాం. మారినట్లు అందరికీ తెలిసేందుకు పెద్ద ఫ్లెక్సీలు వేద్దాం. పైసలు సంపాదించుకుందామనేది వైసీపీ నుంచి టీడీపీ పంచన చేరుతున్న వారిలో కొందరు అక్రమార్కుల వాదన. అక్రమ దందాల్లో పోటీ లేకుంటే సిండికేట్‌గా అందరూ కలిసి అడుగులు వేస్తే నాలుగు రూపాయలు అదనంగా సంపాదించుకోవచ్చనేది ఆర్ఆర్ మార్క్ పాలసీ. దీంతో పట్టా భూములు, ప్రభుత్వ భూములు, సొనలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగిస్తున్నారు.

జరిమానాలతో మమ..

ఇసుక అక్రమ దందాను వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి, ఎన్‌జీటీ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారు. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు అప్పుడప్పుడూ మొక్కుబడిగా ఇసుక ట్రాక్టర్లను ఆపి జరిమానా వేసి మమ అనిపిస్తున్నారు. ఎక్స్‌వేటర్లతో ఇసుకను తవ్వి తరలిస్తున్నా పట్టించుకోవడంలేదు.


పందిళ్లపల్లి సమీపంలోని పీఎస్ క్వారీ నుంచి అక్రమంగా ఇసుకలోడ్‌తో వస్తున్న టిప్పర్

సైబర్ నేరాలపై దృష్టి సారించండి

- సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి



పర్చూరు: కారంచేడు పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ తుషార్ డూడీ తదితరులు

చీరాలటౌన్/ పర్చూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు నేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. చీరాల వన్‌టౌన్, పర్చూరు మండలం కారంచేడు పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అలాగే స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న కమాండ్ కంట్రోల్ రూంపై ఆరా తీశారు. ఇటీవల డిజిటల్ అరెస్టుల సంఖ్య అధికంగా ఉన్నట్లు వివరించారు. వాట్సాప్ కాల్స్ చేసి కస్టమ్స్, విజిలెన్స్, ఇతర శాఖల పేరుతో సామాన్యులకు బెదిరింపు కాల్స్ వస్తే స్టేషన్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం వలన నేరాలు నియంత్రించవచ్చన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సముద్ర తీరంలో సైతం సీసీ కెమెరా నిఘా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐ శ్రీనివాసరావు, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి
- తండ్రి పరిస్థితి విషమం
- తల్లికి తీవ్రగాయాలు


ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు (ఫైల్)


అపస్మారక స్థితిలో ఉన్న భర్త, కుమారుడిని చూసి సంఘటనా స్థలంలో విలపిస్తున్న దివ్య


చీరాలటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు రోజుల్లో క్రిస్మస్ పండుగ. ఇద్దరు పిల్లలతో కలిసి ఆనందంగా చేసుకోవాలని ఆ దంపతులు భావించారు. నూతన వస్త్రాలు కొనేందుకు కుమారుడు, కుమార్తెను తీసుకొని ద్విచక్ర వాహనంపై చీరాలకు వచ్చారు. షాపింగ్ ముగించుకొని తిరుగు ప్రయాణమైన వారు రోడ్డు ప్రమాదం బారినపడ్డారు. తొమ్మిదేళ్ల కుమారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం చీరాల ఆర్వోబీపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మునిసిపల్ పరిధిలోని ఆనందనగర్‌కు చెందిన ఆరెతోటి ప్రవీణ్ కుమార్, దివ్య దంపతులు. ఆయన ప్రైవేటు ఎలక్ట్రీషియన్. ఆమె గృహిణి. వారి కుమార్తె జెస్సీ 6వ తరగతి, రాహుల్ (9) 5వ తరగతి చదువుతున్నారు. మరో మూడు రోజుల్లో క్రిస్మస్ పండుగ ఉండడంతో నలుగురూ ద్విచక్ర వాహనంపై చీరాలకు వచ్చారు. ముందుగా దివ్య పుట్టిల్లు పేరాల ఆనందపేట కావడంతో అక్కడికి వెళ్లారు. బంధువులతో కాసేపు ఆనందంగా గడిపారు. దుస్తులు కొనేందుకు వెళ్లి వస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లారు. అనంతరం చీరాల్లో అందరూ నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. తిరిగి వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య ఉంటుందని ఆర్వోబీ వంతెనపై మీదుగా పేరాలగేటు వద్ద నుంచి బాపట్ల వెళ్ళాలనే ఉద్దేశంతో ఆ మార్గంలో ప్రయాణించారు. పర్చూరు వైపు నుంచి చీరాలకు వస్తున్న చీరాల ఆర్టీసీ డిపో బస్ డ్రైవర్ పల్లెవెలుగు బస్సును ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ప్రవీణ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. చిన్నారి బాలుడు రాహుల్‌పై నుంచి బస్ చక్రం వెళ్లింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు తీవ్రగాయమైన తండ్రి ప్రవీణ్ కుమారుడిపై చేయివేసి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దివ్య ముఖానికి బలమైన రక్త గాయాలయ్యాయి. జెస్సీ మాత్రమే క్షేమంగా బయటపడింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్‌డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రాహుల్ మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దివ్య చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. కుమార్తె జెస్సీకి ఎలాంటి గాయాలు లేవు.

తల్లిప్రేమను చూస్తూ తల్లడిల్లారు...

రోడ్డు ప్రమాదం అనంతరం తల్లి దివ్యను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడికి తీసుకెళ్లే సరికి ఆమె స్పృహ కోల్పోయింది. అయినప్పటికీ 'నా కొడుక్కి డ్రెస్ నచ్చిందా.. లేదంటే మరో డ్రెస్ కొంటాను' అని కలవరిస్తున్నట్లు మాట్లాడడం చూసిన బంధువులు, ఇతరులు కన్నీటి పర్యంతమయ్యారు. తల్లి ప్రేమను చూస్తూ తల్లడిల్లారు.

దిక్సూచి DIKSUCHI

ఎస్‌బీఐలో 13,735 క్లర్క్ జాబ్స్



భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఖాళీలు ఇవి.
హైదరాబాద్ సర్కిల్: 342, అమరావతి సర్కిల్: 50

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హతలు: ఏ విభాగంలో అయిన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తునకు అర్హులు. అలాగే ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంల్లో ఈ కేంద్రాలున్నాయి.

ప్రిలిమినరీ/ మెయిన్స్: ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ ఏప్రిల్‌లో జరుగుతుంది.

ఎంపిక: ఈ పరీక్షలను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష: ప్రశ్న పత్రం మొత్తం వంద మార్కులకు ఉంటుంది. జవాబులను 60 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక్కో విభాగానికి కేటాయించిన నిర్దిష్ట వ్యవధిలోనే సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇందులో నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా జవాబు రాసిన ప్రతీ ప్రశ్నకు 1/4 మార్కును కట్ చేస్తారు. సుమారుగా ప్రతీ ఖాళీకి పదిమంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమి.

మెయిన్ పరీక్ష: ఇందులో 200 మార్కులకు 190 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 40 నిమిషాల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా సమాధానం రాసిన ప్రతీ ప్రశ్నకు పావు మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50 ప్రశ్నలు	50 మార్కులు	35 నిమిషాలు
ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ &	50 ప్రశ్నలు	50 మార్కులు	45 నిమిషాలు
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు	60 మార్కులు	45 నిమిషాలు
మొత్తం	190	200	2 గం. 40 నిమి.

- **హైదరాబాద్ సర్కిల్:** 342
- **అమరావతి సర్కిల్:** 50
- **చివరి తేదీ:** 2025 జనవరి 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు.
- **పూర్తి వివరాల కోసం:** sbi.co.in/web/careers/current-openings వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రిపరేషన్ టిప్స్

జనరల్

- ప్రిపరేషన్ ప్రారంభించే ముందే సిలబస్, వెయిటేజీ పట్ల అవగాహన తెచ్చుకోవాలి. వెయిటేజ్ ఆధారంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- ఎక్కువ సిలబస్ ఉన్న దృష్ట్యా సరైన ప్రణాళికను తయారు చేసుకోవాలి. మెయిటేజీ, కష్టాన్ని బట్టి ఆయా టాపిక్‌కు సమయాన్ని కేటాయించుకోవాలి.
- నిర్దిష్ట సమయంలో సిలబస్ పూర్తయినప్పటికీ పునశ్చరణ అనేది క్రమం తప్పకుండాలి చేసుకోవాలి. దీంతో పరీక్షహాల్లో వేగంగా సమాధానాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.
- బ్యాంకింగ్ తదితర పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. నిర్దిష్ట సమయంలో జవాబు పూర్తయ్యేలా కృషిచేయాలి. ఒక ప్రశ్నకు ఎక్కువ సమయం పడుతుందనుకుంటే వెంటనే దానిని వదిలేసి ఇంకోదానికి వెళ్లిపోవాలి. చివర్లో టైమ్ మిగిలితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
- మాక్ టెస్టులు తప్పనిసరి. అభ్యర్థి బలాలు, బలహీనతలు దీనితో బయట పడతాయి. తప్పులు కనిష్ట స్థాయిలో ఉండే విధంగా అభ్యర్థులు సిద్ధం కాగలుగుతారు.

ఇంగ్లీషు

- ఇంగ్లిషు సిలబస్ ఇటీవల కాలంలో చాలా మారింది. అందుకే నిర్లక్ష్యం చేయొద్దు.
- రెనిన్ మార్టిన్ బుక్ నుంచి గ్రామర్ రూల్స్‌ను నేర్చుకోవాలి. ఉదాహరణల ఆధారంగా వాటిని నేర్చుకోవాలి.
- ఇంగ్లిషు ఆర్టికల్స్ రోజు చదవాలి. కొత్త పదాలు రాసుకోవాలి. తరచుగా పునశ్చరణ చేసుకోవాలి.
- క్లోజ్ టెస్ట్, పిల్లర్స్, సెంటెన్స్ కరెక్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ చాప్టర్లను ప్రాక్టీసు చేయాలి.

రీజనింగ్

- బేసిక్ కాన్సెప్టులు అర్థం అయితే ఈ సెక్షన్ సులువు.
- పరీక్షలో వచ్చే అవకాశం ఉన్న పజిల్ మోడల్స్ రోజు రెండు మూడు పూర్తి చేయాలి.
- ఇన్ ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, డైరెక్షన్ డిస్టెన్స్, రక్త సంబంధాలు చాప్టర్లు ప్రాక్టీసు చేయాలి.

క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్

- స్క్వేర్స్, క్యూబ్స్, టేబుల్స్ బట్టీపట్టాలి.
- పరీక్షలో కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదిక్ ట్రిక్స్ ప్రాక్టీసు చేయాలి.
- బేసిక్ చాప్టర్లు అయిన నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, యావరేజ్, రేషియో ప్రపోర్షన్స్, పర్సెంటేజీలు బాగా చూసుకోవాలి.
- బార్ గ్రాఫిక్స్, టాబులర్ డిఐ తదితర డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెట్స్ ప్రాక్టీసు ముఖ్యం.

కరెంట్ అఫైర్స్

- క్రమం తప్పకుండా పేపర్ చదవాలి. రెండు మూడు పత్రికల ఎడిటోరియల్ పేజీలు చూడాలి.
- సీఎస్ఆర్ జీకే పుస్తకాలు ఫాలోకావాలి.
- మనోరమ ఇయర్ బుక్ చదివితే మంచిది.

రిఫరెన్స్ పుస్తకాలు

- **క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్:** ఎస్ చాంద్, ఆర్.ఎస్. అగర్వాల్, అరుణ్ శర్మ, ఎంకె పాండే పుస్తకాలు చదవాలి.
- **ఇంగ్లీషు లాంగ్వేజ్:** రెనిన్ మార్టిన్, అరిహంత్ పబ్లికేషన్స్, ఎస్.చాంద్ పుస్తకాలు మంచివి
- **జనరల్ అవేర్‌నెస్:** మనోరమ ఇయర్ బుక్, సీఎస్ ఆర్ జీకే, దిన పత్రికలు
- **బ్యాంకింగ్ అవేర్‌నెస్:** అరిహంత్ పబ్లికేషన్స్

జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2025

అడ్మిషన్



దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ ప్రకటన వెలువడింది. 2025 మే 18న ఎంట్రెన్స్ నిర్వహించనున్నారు. ఫలితాలను జూన్ 2న ప్రకటిస్తారు. 2025 ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీల్లో 17,695 బీటెక్, బీఎస్(బ్యాచిలర్ ఆఫ్ సైన్స్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయడానికి అర్హులు. ఈ సంవత్సరం పరీక్షలను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తోంది.

కలికిరి సైనిక్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగాలు

జాబ్ కార్నర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలికిరిలోని సైనిక్ స్కూల్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం ఏడు ఉద్యోగాలు ఉన్నాయి. స్కూల్ మెడికల్ ఆఫీసర్-1, పీజీటీ(కంప్యూటర్/ మేథ్స్)-2, టీజీటీ(సోషల్ సైన్స్)-1, పీటీఐ కం మ్యాట్రన్-1, కౌన్సెలర్-1, హార్స్ రైడింగ్ ఇన్‌స్ట్రక్టర్-1 ఖాళీలు ఉన్నాయి. 2025 జనవరి 10వ తేదీలోపు దరఖాస్తు పోస్టులో పంపించాలి. పూర్తి వివరాల కోసం https://sskal.ac.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and post-graduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date: 31-12-2024 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date: 15-01-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

PROMYS India

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists) 2025 is offered by PROMYS, an Indian residential mathematics summer program, in partnership with the Indian Institute of Science (IISc.) to the students of classes 9 to 12.
Eligibility: Applicants must be at least 15 years old on May 11, 2025. They must be enrolled in classes 9 to 12 or pre-university courses in a government-funded, government-aided, private, unaided, independent school, sixth-form college, home schools, or other types of secondary and higher secondary schools.
Prizes & Rewards: Selected students will receive a full scholarship covering tuition fees and other benefits.
Last Date to Apply: 15-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PROM2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

రేవతి కుటుంబాన్ని పరామర్శించా

జగపతి బాబు



సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని తాను పరామర్శించానని, కానీ ప్రచారం చేసుకోలేదని నటుడు జగపతి బాబు అన్నారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ నుంచి ఎవరూ పరామర్శించలేదని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై జగపతి బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు. 'సినిమా షూటింగ్ పూర్తయ్యాక ఊరి నుంచి తిరిగి రాగానే వెంటనే ఆసుపత్రికి వెళ్లాను. బాధిత కుటుంబాన్ని పరామర్శించాను. శ్రీతేజ తండ్రి, సోదరిని పలకరించా. బాబు కోలుకుంటాడని ధైర్యం చెప్పా. కానీ ప్రచారం చేసుకోలేదు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు క్లారిటీ ఇవ్వాలని చెబుతున్నా' అని జగపతి బాబు ఆ వీడియోలో పేర్కొన్నారు.



రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

సుకుమార్

"రంగస్థలం'లో అద్భుతంగా నటించిన రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందనుకున్నా. కానీ రాలేదు. ఈసారి 'గేమ్ ఛేంజర్ క్లైమాక్స్‌లో రామ్‌చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు డైరెక్టర్ సుకుమార్. రామ్‌చరణ్ హీరోగా ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను డ్రీమ్స్ రాజేశ్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విదేశీ ప్రేక్షకులు తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. 'వన్ 'నేనొక్కడినే' చిత్రాలను ఇక్కడ ఆదరించి ఉండకపోతే నాకు తర్వాతి సినిమాలు వచ్చేవి కావు' అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' క్రికెట్‌కు సచిన్ ఎలాగో...ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. అలాంటి డైరెక్టర్‌తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఇది మా బేనర్‌లో 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. ఓ సాంగ్‌ను డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నామని తెలిసి నాకు సంతోషం వేసింది. రామ్‌చరణ్ వల్లే సినిమా ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ' ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుడి మధ్య వచ్చే ఘర్షణ మీదే ఈ చిత్రం ఉంటుంది. రామ్‌చరణ్ ఎంతో అద్భుతంగా నటించారు' అని అన్నారు.

కించపరిచే పోస్టులొద్దు

- అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి



సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు, మీ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయండి అని అల్లు అర్జున్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే నకిలీ అకౌంట్ల ద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలో అభిమానుల ముసుగులో కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అల్లు అర్జున్ అలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

మర్రిచెట్టు కింద



ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన, ముస్కాన్ రాజేందర్ హీరో, హీరోయిన్లుగా నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు' పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది. నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటులు పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏఏ ప్రెసిడెంట్ రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ 'బేనర్, టైటిల్, డైరెక్టర్...ఇలా ఈ సినిమాకు అన్నీ పవర్‌ఫుల్‌గానే ఉన్నాయి' అని అన్నారు. చిత్ర దర్శకుడు నరేశ్ వర్మ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది' అని తెలిపారు.

బెనిఫిట్‌కు బ్రేక్?

'తెలంగాణలో ఇక నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలు పెంచబోం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ అనుమతినివ్వను. ఈ కుర్చీలో ఉన్నంతవరకూ మీ ఆటలు సాగనివ్వను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక టాలీవుడ్‌ను కలవరపరుస్తోంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కొత్త మలుపులు తీసుకుంటూ చిత్ర పరిశ్రమ మెడకు చుట్టుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమౌతోంది.

బెనిఫిట్ షోల రద్దు ప్రభావం వెంటనే తెలుగు చిత్ర పరిశ్రమపై కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సంక్రాంతికి విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు వసూళ్ల పరంగా భారీగా లబ్ధి చేకూరుతుండగా, ఇకపై దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది.

సంక్రాంతి చిత్రాలివే...

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. రూ. 450 కోట్ల భారీ బడ్జెట్‌తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం అన్ని రికార్డులను తిరగరాస్తుందనే అంచనాలు ఉన్నాయి. జనవరి 12న బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకూ మహారాజ్' విడుదలవుతోంది. జనవరి 14న వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదలవుతోంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు లేకపోతే ఈ సినిమాల వసూళ్లు దెబ్బతింటాయి. 'గేమ్ ఛేంజర్'తో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలను దిల్‌రాజు నిర్మించారు. ఆయనతో పాటు సినీ పెద్దలు ఇప్పటివరకూ ప్రభుత్వ నిర్ణయంపై స్పందించలేదు. ప్రభుత్వంతో ఏమైనా సంప్రదింపులు జరుపుతారా అనేది వేచి చూడాలి.

వసూళ్లలో కీలక పాత్ర

బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న స్టార్ హీరోల సినిమాలకు ఎంతగానో అవసరం. భారీగా ఆరంభ వసూళ్లు తెచ్చుకోవడానికి.. సినిమా త్వరగా బ్రేక్ ఈవెన్ కావడానికి దోహదం చేస్తాయి. ఈ నెల 5న విడుదలైన 'పుష్ప 2' సినిమా తొలిరోజే ఏకంగా రూ.294 కోట్లు రాబట్టడంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కీలక పాత్ర పోషించాయి. అలాగే ముందురోజు పెయిడ్ ప్రీమియర్ షోలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా టికెట్ రేట్లు పన్నులతో కలిపి సింగిల్ స్ర్కీన్స్‌లో రూ.1000.. మల్టీప్లెక్సుల్లో రూ.1200లు దాటిపోయాయి. అలాగే రిలీజైన 18 రోజుల వరకూ టికెట్ ధరను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది తెలంగాణ సర్కార్. 'పుష్ప 2'తో పాటు ఈ ఏడాది విడుదలైన 'దేవర', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు లభించడంతో మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకున్నాయి. అయితే, 'పుష్ప 2' ప్రీమియర్స్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం.. బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం, అసెంబ్లీలో ఈ ఘటన గురించి ప్రస్తావన రావడం.. అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీని ప్రభావం రానున్న సినిమాలపై పడనుంది.







భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, కొన్ని రోజుల వరకూ టికెట్ ధరల పెంపు, అదనపు ఆటలకు వెసులుబాటు ఇవ్వాలని పరిశ్రమ కోరడం, ప్రభుత్వం అంగీకరించడం జరుగుతోంది. ఒకప్పుడు ఎన్ని సెంటర్లలో వంద రోజులు ఆడిందనేది సినిమా విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఫస్ట్ డే వసూళ్లు.. అడ్వాన్స్ బుకింగ్స్, వారాంతపు వసూళ్లు ప్రామాణికంగా మారాయి. అలా, విజయం కోసం కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఝలక్ ఇచ్చిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

కత్తి కంటే కరుణ గొప్పది

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



ప్రార్థన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి

కొల్లిపర, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కత్తి కంటే కరుణ.. కక్ష కన్నా క్షమాభిక్ష గొప్పవని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర నూతన యెరూషలేము ప్రార్థన మందిరం సమీపంలో పాస్టర్ ఈమని మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అమెరికాలో తన దగ్గర ఉద్యోగంలో ఉన్న 500 మందిలో 400 మంది క్రిస్టియన్స్ అని తెలిపారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచు కోవాలన్నారు. అనంతరం క్రైస్తవులతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కేక్‌కట్ చేసి అందరికీ సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచి పిల్లి రాధిక, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధన రెడ్డి, భీమవరపు లంకకోటి రెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, ఉయ్యూరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేష్ కుమార్‌కు గోల్డ్ డిస్క్ అవార్డు



గోల్డ్ డిస్క్ అవార్డును అందుకుంటున్న నరేష్‌కుమార్

దుర్గి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులకు చెందిన చిరుమామిళ్ల నరేష్‌కుమార్‌ను గోల్డ్ డిస్క్ అవార్డు వరించింది. దేశ సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికుల ప్రాణాలను కాపాడేందుకు చేసిన సేవలకుగానూ నరేష్‌కుమార్‌కు ఈ అవార్డు లభించింది. గత శుక్రవారం చండీగఢ్‌లో అక్కడి డీజీపీ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. సైనికుల్లో శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన పరిశోధనలు చేసి క్షయ రోగుల్లో అనుకూల రోగనిరోధక శక్తిలో లోపాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై నరేష్‌కుమార్ అధ్యయనం చేశారు. ఈయన తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, మంగమ్మ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. నరేష్ కుమార్ ప్రాథమిక విద్యను అడిగొప్పులలో, ఉన్నత విద్యను కారంపూడిలో, ఇంటర్‌ను హైదరాబాద్‌లో పూర్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్‌లో 43వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని గాంధీ వైద్యశాలలో 2006లో ఎంబీబీఎస్ సీటు పొందారు. ఎంబీబీఎస్ చివరి సంవత్సరంలో తండ్రి మరణించారు. 2014లో చండీగఢ్‌లో సహాయ కమాండరుగా ఉద్యోగం సాధించారు.

గార్డెన్‌లో గంజాయి మొక్క



మాచర్లటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కను గుట్టుచప్పుడు కాకుండా అటవీ ప్రాంతాల్లో పెంచడం వింటుంటాం. కానీ పట్టణ నడిబొడ్డున అదీ కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి మొక్క పెరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పట్టణంలోని ఆర్‌అండ్‌బి ఆఫీస్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ గార్డెన్‌లో గంజాయి మొక్క పెరుగుతోంది. ఇది ప్రస్తుతం నాలుగు అడుగుల దాకా పెరిగింది. ఇది గుర్తించిన కొందరు విద్యార్థులు గంజాయి మొక్క ఆకులను తెంచుకొని వెళ్తున్నారు. ఈ విషయం కాస్తా బయటకు పొక్కి పోలీసుల దాకా చేరింది. దీంతో పట్టణ పోలీసులు ఆదివారం ఆ గంజాయి మొక్కను తొలగించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

మండలిలో ఆలపాటి సేవలు అవసరం

● ఆయన్ని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ప్రజా ప్రతినిధులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలపాటిని గెలిపిస్తే ప్రభుత్వానికి, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల మధ్య వారధిగా పనిచేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్‌లో ఆదివారం, గుంటూరు-కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు అధ్యక్షత వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కూటమి ఒప్పందానికి అంగీకరించి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తెనాలిలో 55 వేల మెజారిటీ తీసుకువచ్చేలా ఆలపాటి రాజా కష్టపడ్డారని గుర్తుచేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు తిరుగులేని మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కష్టపడాలని సూచించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాసన మండలి క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఆలపాటిని గెలిపించి శాసనమండలికి పంపాలని కోరారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఐక్యంగా పోటీచేస్తే వచ్చే ఫలితాలు శాసనసభ ఎన్నికలు రుజువు చేశాయని అన్నారు. ఓట్లు చీలకుండా, నాయకులను సమన్వయం చేసుకుని ఆలపాటి గెలుపునకు కృషి చేయాలన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఓటమిని ముందుగానే జగన్ ఊహించి పోటీ నుంచి తప్పుకున్నాడని ఎద్దేవా చేశారు. ఇదే కొనసాగితే 2029లో జరిగే శాసనసభ ఎన్నికల ముందే జగన్ తప్పుకుంటాడని విమర్శించారు. దాదాపు ఆలపాటి గెలుపు నిర్ణయమైందని, కాకపోతే అత్యధిక మెజార్టీ కోసం కృషి చేయాలన్నారు. అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ అభ్యర్థిగా ఎంపిక చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహమద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, చిరంజీవిరావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యరావు, అబద్దయ్య, మంజులా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు రాయపాటి శ్రీనివాస్, ఏఎస్ రామకృష్ణ, కూటమి నాయకులు గాదె వెంకటేశ్వరరావు, మాగంటి సుధాకర్, ఉపాధ్యాయుల సంఘ నాయకులు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలలకు చెందిన పట్టభద్రులు పాల్గొన్నారు.

జీవాలపైకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

● 147 మృతి.. కాళ్లు విరిగిన మరో 50 జీవాలు

● సుమారుగా రూ. 50 లక్షల నష్టం



పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా ప్రయాణం చేస్తున్న ట్రావెల్స్ బస్సు మేత కోసం తోలుకొని వెళ్తున్న జీవాల గుంపును తొక్కుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో 147 జీవాలు మృతి చెందగా, మరో 50 జీవాల కాళ్లు విరిగి, తలలు పగిలి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి అయిన అలంకార్ థియేటర్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం ఉదయం 5.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహబూబ్‌నగర్ జిల్లా ధన్‌వాడ గ్రామానికి చెందిన ఆవుల మల్లేష్, కర్రెన్నలకు చెందిన గొర్రెల మంద గురజాల మండలం పులిపాడు గ్రామంలో గత వారం రోజులుగా ఉన్నాయి. అక్కడి నుంచి దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి జీవాల మేతకై తోలుకొని వెళ్తున్నారు. ఈ మందలో 600 వరకు జీవాలు ఉన్నాయి. రాష్ట్ర రహదారి రోడ్డెక్కి దాచేపల్లిలోని అలంకార్ థియేటర్ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి జీవాల మంద చేరుకున్నాయి. ఈలోగా హైదరాబాద్ నుంచి ఇంకొల్లుకు ప్రయాణం చేస్తున్న మారుతి ట్రావెల్స్ బస్సు అతివేగంగా వస్తూ నేరుగా జీవాల గుంపుపైకి తొక్కుకుంటూ ముందుకెళ్లింది. బస్సు ముందు టైర్ కింద సుమారు 30 నుంచి 40 దాకా గొర్రెలు ఉండచుట్టుకొని టైర్‌కు అడ్డుపడటంతో ముందుకు కదలలేని స్థితిలో బస్సు ఆగిపోయింది. ఈలోగా బస్సు డ్రైవర్‌ను హెచ్చరించేందుకు కేకలు పెడుతూ వెళ్లిన ఆవుల మల్లేష్, కర్రెన్నలను కూడా బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గామాలపాడు గ్రామ సర్పంచి జంగా సురేష్ నాయకత్వంలో రోడ్డుపై బైటాయించారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం..

టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. వారికి న్యాయం జరిగే వరకూ అన్నివిధాల అండగా ఉంటామని, జరిగిన నష్టంపై పల్నాడు జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ బస్సు యజమాని నుంచి యాదవ సోదరులకు నష్టపరిహారం ఇప్పించే చర్యలు తీసుకుంటాం అని చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి గాయపడిన కాపరులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగమే ప్రమాదానికి కారణమని అన్నారు. దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎస్ఐ సౌందర్‌రాజన్ సంఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు సంఘటనా స్థలంలో బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. గురజాల డీఎస్పీ జగదీష్ తదితరులు సంఘటనా స్థలంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆగ్రహంతో ఉన్న యాదవలను సమాధానపరిచి రాస్తారోకోను విరమింపజేశారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అడిషనల్ ఎస్పీ ఏవీ సంతోష్, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఎస్‌బీ సీఐ బండారు సురేష్‌బాబు, గురజాల సీఐ ఆవుల భాస్కర్ సంఘటనా ప్రాంతాన్ని సందర్శించారు.

కళ్లెదుటే జీవనం కుప్పకూలింది

దాచేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కళ్లముందే తనవాళ్లు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. అప్పటి వరకు తను అదిరించి బెదిరించి తోలుతున్న జీవాలు బస్సు టైర్ల కిందపడి ప్రాణాలు కోల్పోయాయి. తన పక్కన తోడు ఎవరూ లేరు. అయినా శ్రీకాంత్ ధైర్యంతో పోలీసులకు, స్థానికులకు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయులకు సమాధానం చెప్పాడు. గొర్రెల మంద యజమాని కుమారుడైన బాలుడు శ్రీకాంత్ సంఘటనా స్థలంలోనే నదురు బెదురు లేకుండా నిల్చొని ఉన్నాడు. పోలీసు ఉన్నతాధికారులతో పాటు టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, గామాలపాడు సర్పంచి జంగా సురేష్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై ప్రత్యక్ష సాక్షిగా ఉన్న శ్రీకాంత్‌ను వివరాలు అడిగారు. శ్రీకాంత్ ఏమాత్రం అధైర్యపడకుండా అందరికీ తనకు తెలిసిన సమాచారాన్ని వివరించాడు.

(5వ పేజీ తరువాయి)

క్రీడల్

నిర్వహిస్తున్నా పీడీ పోస్టు లేదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులకు పీడీ ఉన్నా ఆట స్థలం లేదు. ప్రాంగణంలో టైల్స్ వేయడంతో దానిపై ఇసుక పోసి మొక్కుబడిగా ఆటలు ఆడిస్తున్నారు.

● చీరాల నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. అయితే ఆయా కళాశాలల్లో ఆటస్థలాల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ విద్యార్థులకు ఆటలకు అవకాశం లేకుండా పోయింది.

● వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1979-80లో ప్రారంభించగా అప్పటి నుంచి పీడీ పోస్టు లేదు. దీంతో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి ఉన్నా ఆటలు ఆడించే వారు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. పీడీ పోస్టు లేకపోవడంతో క్రీడలకు చెందిన ఎలాంటి వస్తువులు కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కావడంలేదు.

● రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడేళ్ల క్రితం పీడీ ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. కళాశాలలో పెద్ద క్రీడా మైదానం ఉన్నా 150 మంది విద్యార్థులకు క్రీడలు నేర్పించే పరిస్థితి లేదు. కనీసం ఆటలు ఆడుకునే పరికరాలు కూడా లేవు. కళాశాల ప్రాంగణంలో 2022లో అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ఇండోర్ స్టేడియానికి శంకుస్థాన చేయగా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. బేస్‌మెంట్, చుట్టూ ఐరన్ పిల్లర్స్ పైన కప్పు వేశారే తప్ప కింద భాగంలో కాంక్రీట్ వేయలేదు. ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీటి పైప్‌లైన్లు వెయ్యాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఇండోర్ స్టేడియం పనులను నిలిపివేశారు.

● మాచర్లలో ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం ఉండగా ఆట పరికరాలు, పీడీ లేరు. దుర్గిలోని జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం లేదు. పీడీ లేరు.


● వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదేళ్ల నుంచి పీడీ పోస్టు భర్తీకి నోచుకోలేదు. విశాలమైన గ్రౌండ్ ఉంది. దీంతో కళాశాలలోని 450 మంది విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపలేకపోతున్నారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం సక్రమంగా లేదు. ఒకే ఒక పీఈటీ ఉన్నారు. దీంతో విద్యార్థులకు క్రీడా అవకాశాలు కోల్పోతున్నారు. మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్‌పై పీఈటీ ఉన్నా ఆట స్థలాలు లేవు.

● సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం అధ్వానంగా ఉంది. పిచ్చిచెట్లు, గుంతలతో నిండి ఉన్న మైదానంలో విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేదు. పీడీ పోస్టు ఉన్నా అవసరమైన క్రీడా పరికరాలు లేవు. మైదానం అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్, పీడీలు ఇటీవల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

● పిడుగురాళ్ల, గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాలు అధ్వానంగా ఉన్నాయి. కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. దాచేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం లేదు. పీడీ పోస్టు ఖాళీగా ఉంది. క్రీడా పరికరాలు ఉన్నా వినియోగించే వీలులేక బీరువాలో ఉన్నాయి.

● పొన్నూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సౌకర్యాలతో పాటు పీడీ పోస్టు ఏళ్లుగా భర్తీ కాలేదు. వెల్లలూరులోని జూనియర్ కళాశాలలో క్రీడలకు అవసరమైన ప్రాంగణం లేదు. పీడీ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కళాశాల విద్యార్థులకు అదే ప్రాంగణంలోని హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు క్రీడల శిక్షణ ఇస్తున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని జూనియర్ కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.

ఉరకలెత్తిన ఉత్సాహం



యువజనోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటీ 2024-25 వేడుకలు ఘనంగా ఆదివారం ముగిశాయి. రెండో రోజు యువజనోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. ఆట, పాటలతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. సాహితీ ప్రహేళిక, ఆధునిక అష్టావధానం, జానపద, శాస్త్రీయ నృత్యం, సంగీతం, సాంస్కృతిక అంశాలతోపాటుగా కోడ్ రిలైంట్, ట్రెజర్ హంట్, మ్యాట్రిక్ మిస్టరీ, క్యాడ్ కాంటెస్ట్, బ్రెయిన్లీ బవుంట్ వంటి సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో క్రీడలు ఉత్కంఠగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాషామాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సెక్రటరీ, కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు. యువజనోత్సవం పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ యువజనోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96.104.115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

బధిరరహిత స్వర్ణాంధ్ర సాధనకు కృషి



శిబిరంలో భాష్యం రామకృష్ణ, డాక్టర్ సుబ్బారాయుడు

గుంటూరు మెడికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన బధిరరహిత స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం గుంటూరువారితోట మూడో లైన్‌లోని రాధికా రాయుడు హాస్పిటల్‌లో ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినికిడిలోపం గల పిల్లలకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వినికిడిలోపం గల చిన్నారులకు ఉచితంగా కాక్లియార్ ఆపరేషన్లు చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తామని భాష్యం రామకృష్ణ తెలిపారు. ఇఎన్‌టీ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఉచితంగా కాక్లియార్ సర్జరీలు జరుగుతున్నట్లు తెలిపారు. దీనిపై తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక వయసు పరిమితి దాటిన తర్వాత పిల్లలను తీసుకురావడం వల్ల ఉచిత ఆపరేషన్లు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన శిబిరంలో 100 మంది పిల్లలకు వినికిడి లోపం పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ పాములపాటి రాధికా రాణి తెలిపారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గొంది శివరామకృష్ణ, దంత వైద్యులు సాయిశంకర్, డాక్టర్ దినేష్, ఆడియాలజిస్ట్ టి.నరేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తాం



చెరుకూరి సుభాష్ చంద్రబోస్‌కి సత్కారం

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తామని చెరుకూరి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఆదివారం పెదకాకానిలో చెరుకూరి వారి 5వ ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షులు చెరుకూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అనంతపురంకు చెందిన ఇంటర్ విద్యార్థికి రూ.65 వేలు చదువు నిమిత్తం సహాయం అందించామన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని ఆయన సూచించారు. విష్ణు కెమికల్స్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ చదువుకున్న వారికి తమ సంస్థలో ఉద్యోగ కల్పన చేస్తామని ప్రకటించారు. 500 మందికిపైగా చెరుకూరి వంశస్తులు, శ్రీబిల్డర్స్ అధినేత సతీష్ బాబు, చెరుకూరి లెనిన్, ఆర్చరీ అకాడమీ అధినేత సత్యనారాయణ, సీతారామయ్య, జగదీష్ చంద్రశేఖర్ హాజరయ్యారు.

భారీ స్కోరు దిశగా ఉత్తరాఖండ్



మయాంక్ (104 నాటౌట్)

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 288 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు మయాంక్ ముదిల 132 బంతుల్లో 104, అనయ నేగి 230 బంతుల్లో 90, ఆదిత్య 124 బంతుల్లో 61 పరుగులు చేశారు. కర్ణాటక బౌలర్లు కె.గగన్ సాయి, జి.వెంకటేష్, కె.ప్రీతమ్ రాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

వర్సిటీ ఖోఖో జట్టుకు 15 మంది ఎంపిక



విజేతలకు కప్ అందజేస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

గుంటూరు(విద్య), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీజేపీఎస్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల ఖోఖో (పురుషుల) పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విక్టరి డిగ్రీ (నరసరావుపేట) కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీం ఎంపికలు జరిగాయి. యూనివర్సిటీ ఖోఖో జట్టులో విక్టరి డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు, డీసీఆర్‌ఎం కళాశాల నుంచి నలుగురు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల నుంచి ఒకరు, యూనివర్సిటీ వ్యాయామ కళాశాల నుంచి ఒకరు, జేకేసీ కళాశాల నుంచి ఒకరు, ధనలక్ష్మి వ్యాయామ కళాశాల నుంచి ఒకరు మొత్తం 15 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు.

నేడు వేమూరులో జాబ్‌మేళా

వేమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. మాస్టర్ మైండ్స్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, అపెక్స్ సొల్యూషన్స్ కంపెనీ వారు హాజరవుతారు. 100కు పైగా ఖాళీలు ఉన్నాయని, విద్యార్హతను బట్టి ఎంపిక జరుగుతుందన్నారు. రూ.12 వేల నుంచి రూ.20 వరకు జీతం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమో, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంబీపీసీ విభాగాల వారు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను వినియోగించుకోవాలన్నారు. బయోడేటా విద్యార్హత సర్టిఫికెట్లు ఆధార్ నకలతో పాటు పాస్‌పోర్టు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ 80088 63095లో సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వినియోగిస్తే జరిమాన

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, వినియోగించినా భారీ జరిమాన విధిస్తామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాలలో ఆదివారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. పట్టణ ప్రజలు గుడ్డ సంచులు వినియోగించాలని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగిస్తే ఉపేక్షించేదిలేదని, జరిమాన విధిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

అమృతలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శీతాకాలం నేపథ్యంలో దాత పేదలకు దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. అమృతలూరులోని ఉత్తర దళితవాడ తెలుగు బాప్టిస్ట్ చర్చి (ఉత్తరం)లో జరిగిన కార్యక్రమంలో క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని ఎన్నారై దాత, మల్లిపెద్ది వెంకటమురళీ 60 మంది పేదలకు దుప్పట్లను అందించారు. పాస్టర్ వేజెండ్ల శ్రీకాంత్ విశ్వనాధ్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు. పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న దాతను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, పరుచూరి జనార్ధన్, శరణు పున్నారావు, కొడాలి కోటేశ్వరరావు, విరాటపు కాశి, అమర్తలూరి ఆనందరావు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరుజిల్లా జూనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

చెరుకుపల్లి,డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): జడ్పీహెచ్ఎస్ స్కూల్, గుళ్ళపల్లిలో బాలుర జూనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక జరిగింది. ఎంపిక ప్రక్రియలో 70మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కలిగిన 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎస్.వీరప్పయ్యరెడ్డి (బాపట్ల), ఎస్ఎస్ దుర్గాసాయి (బాపట్ల), కె.గోపి (బాపట్ల), డి.మనోజ్‌కుమార్ (ఆర్‌బి పాలెం), ఎన్.ధనష్‌రెడ్డి (పొన్నపల్లి), పి.కార్తిక్‌రెడ్డి (పొన్నపల్లి), జే.విజయ్‌శివసాయి (చెరుకుపల్లి), ఎన్.మణికంఠ (చెరుకుపల్లి), టి.మణికంఠ (చెరుకుపల్లి), జీ.విజయభాస్కర్‌రెడ్డి (పొన్నపల్లి), కె.ప్రవీణ్‌కుమార్ (గుంటూరు), బి.యోగేంద్ర (గుంటూరు), జే.మోహన్‌చందు (చేబ్రోలు), ఎంపికైన వారిలో ఉన్నారు. జనవరి నెల 3, 4, 5 తేదీలలో కర్నూలులో జరిగే 50వ అంతర్‌జిల్లా పోటీలలో పాల్గొంటారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డి.నెల్లిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కందుల వెంకటేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్ అక్కల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి.నాగాంజనేయులు రెడ్డి, సెలక్షన్ కమిటీ కోచ్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

శతవసంత ఉత్సవాలను జయప్రదం చేయాలి : సీపీఐ

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శతవసంత ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ పిలుపునిచ్చారు. శృంగారపురం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాడవాడలా ఎర్రజెండా అరుణపతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సీపీఐ శతాబ్దకాలంగా పేద, బడుగు,బలహీనవర్గాల ప్రజలకు, కార్మిక, కర్షకులకు అండగా ఉంటూ అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణారెడ్డి, మామిడిబత్తుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

బాపట్లరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మండలం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద ఓ వ్యక్తి మృతదేహం కనిపించటంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు, రైల్వేపోలీసులు మృతుని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి తలకు తీవ్రగాయాలు అవ్వటంతో మరణించటం జరిగిందని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు

- వివిధ మండలాల్లో ప్రారంభమైన పనులు
- యంత్రంతో హార్వెస్ట్ చేయిస్తున్న రైతులు



వరి పైరును యంత్రంతో హార్వెస్ట్ చేస్తున్న చిత్రం

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో వరికోతలు ముమ్మరంగా ప్రారంభించారు. కొద్ది రోజులుగా వాతావరణ మార్పులతో వరికోతలు కోసేందుకు రైతులు భయపడ్డారు. దీనికితోడు అధికారులు సైతం హెచ్చరికలు జారీ చేసి వరికోతలు కోయవద్దని చెప్పారు. దీంతో రైతులు హార్వెస్ట్ చేయకుండా ఉన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు వరికోతలు ప్రారంభించారు. కొంతమంది రైతులు యంత్రంతో కోతలు కోస్తుండగా మరికొంతమంది నేరుగా యంత్రంతో హార్వెస్ట్ చేస్తున్నారు. కొద్ది మంది మాత్రమే కూలీలతో వరి కోతలు కోయిస్తున్నారు. దీంతో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 53 వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. ఇందులో 75 శాతం పొలాలు వరి కోతకు వచ్చాయి. మిగిలిన 25 శాతం పొలాలలో దీర్ఘకాలిక రకాలు, వరద తర్వాత విత్తిన పొలాలు కావటంతో ఇవి ఆలస్యమయ్యే అవకాశం ఉంది. హార్వెస్ట్ చేసేందుకు యంత్రానికి గంటకు రూ.2800 నుంచి రూ.3 వేలు వరకు వసూళ్ళు చేస్తున్నారు. అయినప్పటికి రైతులు ఎక్కువ మంది హార్వెస్ట్ చేసేందుకు సిద్ధపడుతున్నారు. కోతకోసి కుప్పవేసి నూర్పిడి చేయటానికి ఎక్కువ ఖర్చు అవుతుంది కావున యంత్ర సాయంతోనే నేరుగా నూర్పిడి చేస్తున్నారు. దీనివల్ల పశువులకు గడ్డి తక్కువగా వస్తుంది. పశు పోషకులు మాత్రం కూలీలతో కోత కోయించి కుప్పలు వేయిస్తున్నారు.

అపరాల కోసం రైతులు పరుగులు

వరికోతలు కోసి రబీ సీజన్‌లో అపరాలు సాగు చేసే రైతులు విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు. కూలీలతో కోత కోసే పొలాలలో విత్తనాలు చల్లిన తర్వాత కోస్తున్నారు. హార్వెస్ట్ చేసే రైతులు మాత్రం గడ్డి మొత్తం తొలిగించి విత్తనాలు చల్లి దుక్కి దున్నుతున్నారు. రైతులకు అవసరమైన మినుము, పెసర విత్తనాలు అందుబాటులో లేక వివిధ ప్రాంతాలకు వెళ్ళి తెచ్చుకుంటున్నారు. వ్యవసాయశాఖ ద్వారా కేవలం మండలానికి 75 మినీ కిట్‌లు మాత్రమే రావటంతో వాటిని ఎంపిక చేసిన రైతులకు ఒక్కొక్క కిట్ చొప్పున అందజేశారు. ఎక్కువమంది అపరాలు సాగుపై ఆసక్తి చూపుతుండగా నల్లరేగడి భూములలో కొంతమంది మొక్కజొన్నపై ఆసక్తి కనబరుస్తున్నారు. గరువు ఇసుక నేలల్లో వేరుశనగ విత్తేందుకు సిద్ధపడుతున్నారు. ఏదిఏమైనా వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి.

లోకహితం కోసమే క్రీస్తు జననం

- ఎమ్మెల్యే ఆనందబాబు



పెరవలిలో ఎమ్మెల్యే ఆనందబాబును సత్కరిస్తున్న సంఘ పెద్దలు



సెమీక్రిస్మస్ వేడుకలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

వేమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లోకహితం కోసమే క్రీస్తు జననం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. మండలంలోని పెరవలిలో శనివారం రాత్రి పెరవలి పరిశుద్ధ లూథరన్ దేవాలయం సంఘం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, యేసుక్రీస్తు బోధనల ద్వారా మానవుడు తన జన్మను సార్ధకం చేసుకోగలుగుతాడని అన్నారు. పాస్టర్ తాడిగిరి శేషుబాబు ప్రత్యేక ప్రార్ధన ద్వారా ఆనందబాబును ఆశీర్వదించి సత్కరించారు. ఎమ్మెల్యే క్రిస్మస్ స్టార్‌ను ప్రారంభించి కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్ధనలతో కూడిన కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇక్కుర్తి నాగయ్య, కేసాని శివకృష్ణ, యేమినేని శేషగిరిరావు, బొల్లెద్దు కమల్, మీరావర్ధిని, బండారు సూరిబాబు, సీతారామయ్య, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరలి గ్రామంలో...

కర్లపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పేరలి గ్రామంలోని చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలను దైవజనులు, గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవరంపాటిరాజు, దైవజనులు, గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సైనికులు సర్వమతాలను గౌరవించుకునే కార్యక్రమంలో భాగంగా విజయలక్ష్మీపురంలోని సంఘ కార్యాలయంలో ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మాజీ సైనికుడు ఎం.దాసు క్రిస్మస్ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆడే రాఘవాదేవి, శ్రీనివాసరావు, పుట్టా ఆదిశేషారెడ్డి, సయ్యద్ అఖిల్, సుంకరశేషగిరిరావు, అబ్దుల్ రజాక్, అంజనేయులు, వెంకటేశ్వర్లు, రాయపూడి శ్రీనివాసరావు, నాగరాజు, వేణు, కోకి ధర్మారెడ్డి, అడే కిషోర్, రాంప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరావు, తేజ పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లి వివేక సర్వీస్ సొసైటీ కార్యాలయంలో...

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పరోపకారం, పొరుగువారికి ప్రేమను పంచటం వంటి ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచాన్ని శాంతియుతంగా నడిపించటంలో కీలకభూమిక వహిస్తున్నాయని వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి వివేకసర్వీస్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం 20వ వార్షిక కమ్యూనిటి క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్‌వీవీ నాగరాజు, ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యంతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో లిటిల్‌జెమ్స్ విద్యాశ్రమం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

రామకృష్ణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో...

రేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే విద్యార్థులు అన్ని రకాల పండుగల విశిష్టత తెలుసుకోవాలని రామకృష్ణ ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ కె.అవ ర్ధ అన్నారు. పాఠశాలలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు, విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రిస్మస్ ట్రీలు, వేషధారణలు నిర్వహించారు. అనంతరం క్రీస్తు పుట్టుకకు సంబంధించిన నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



రామకోటిపేటలోని శివాలయం వద్ద గృహాల మధ్య నిలిచిన మురుగునీరు

ఖాళీ స్థలాలతో ప్రజల ఇబ్బందులు

రేపల్లె, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలోని ఖాళీస్థలాల్లో మురుగునీరు నిలిచి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల బారినపడుతున్నారు. గుంతల్లో పందులు సంచరిస్తూ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పట్టణంలోని రామకోటి శివాలయం ఎదురు లోతట్టు ప్రాంతం కావటంతో వర్షానికి కురిసిన నీరు నిల్వ ఉండి పచ్చగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. అలాగే ఉప్పూడి రోడ్డు 14వ వార్డులోని రంగాబొమ్మసందు, రాజేష్ థియేటర్ వెనుక రోడ్డు, నేతాజీ నగర్, 1వవార్డు యానాదికాలనీలో, 2వవార్డు హరిజనవాడలో గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారాయి. దీంతో ఆయా ప్రాంత గృహయజమానులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైన అధికారులు ఖాళీస్థలాల్లో నిలిచిన మురుగు నీరు, పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని కోరుతున్నారు.



14వ వార్డులోని రంగాబొమ్మ వీధిలో గృహాల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు

పాతవారికే పట్టం కట్టిన ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు

- అధ్యక్షుడిగా ముప్పలనేని, కార్యదర్శిగా మానం



ముప్పలనేని శ్రీనివాసరావు | మానం నాగేశ్వరరావు | కోట వీరబ్రహ్మయ్య

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికలలో తిరిగి అధ్యక్షుడిగా ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శిగా మానం నాగేశ్వరరావులను సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికలో ముప్పలనేని 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతంలో ఆయనకు 31 ఓట్ల మెజార్టీ వచ్చింది. మూడుదశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శిగా పని చేస్తున్న మానం నాగేశ్వరరావు 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికలలో ఆయనకు 48 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈవిధంగా ఇద్దరికి మెజార్టీ తగ్గింది. సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన దొడ్డపనేని వెంకయ్యచౌదరి 3 ఓట్లతో గెలుపొందారు. గత ఎన్నికలలో ఆయన ఒక ఓటు తేడాతో ఓడిపోయి ఈసారి గెలుపొందారు. ఉపాధ్యక్షుడు-2గా పారెపల్లి చంద్రశేఖర్ 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడు-1కు పోటీ చేసిన కొల్లా వీరయ్యచౌదరి, కారుమంచి వెంకట్రావులకు 69 ఓట్లు చొప్పున వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు మరోసారి ఓట్లు లెక్కించినప్పటికి ఇద్దరికి సమానంగా ఓట్లు రావటంతో ఇద్దరికి ఏడాదిన్నర చొప్పున పదవీ వచ్చేవిధంగా ఆమోదించారు. దీనికి వారు అంగీకరించినట్లు తెలిపారు. కోశాధికారిగా కోట వీరబ్రహ్మయ్య రెండు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈవిధంగా ముప్పలనేని ప్యానల్‌కు సంబంధించి కోశాధికారి పదవీ కోల్పోవటం జరిగింది. ఎన్నికల అధికారిగా డాక్టర్ జరుగుల సతీష్‌బాబు, సహాయ ఎన్నికల అధికారులుగా డాక్టర్ షేక్ నజీర్, డాక్టర్ సుధాకర్ వ్యవహరించారు.

ఐలవరంలో అమెరికా ఉత్తరాల ఆవిష్కరణ

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అమెరికా ఉత్తరాలను జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తమ్ ఆవిష్కరించారు. ఆదివారం మండల పరిధిలోని భట్టిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెన్‌పాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐలవరం విద్యార్థులు ఇతర దేశాల విద్యార్థులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుంటారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని నెబ్రాస్కా రాష్ట్రంలో నైహార్ట్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు, ఇక్కడి విద్యార్థులు తరచూ ఉత్తర ప్రత్యుత్తరాలు చేస్తున్నట్లు డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, విద్యార్థినీలు పాల్గొన్నారు

ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు వార్డెన్‌ను నియమించరూ!

- ఆయాదే పెత్తనం
- ఏటా తగ్గుతున్న విద్యార్థులు
- కొరవడిన పర్యవేక్షణ



తాళం వేసి ఉన్న ప్రభుత్వ బాలికల హాస్టల్ వార్డెన్ గది

వేమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు అసలు వార్డెన్ ఉన్నారా? లేరా..? అన్న ప్రశ్న ఎవరికైనా కలుగుతుంది. ఎందుకంటే ఎప్పుడు చూసిన వార్డెన్ గది తాళం వేసి ఉంటుంది. ఇక్కడ ఆయాదే పెత్తనం, పూర్తిగా పర్యవేక్షణ కొరవడటంతో ఎప్పటికప్పుడు విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. గతంలో పోల్చుకుంటే ఈ హాస్టల్‌లో వంద మందికి పైగానే విద్యార్థులు ఉండేవారు. రాను రాను సంఖ్య తగ్గుతూ ఈ ఏడాది కేవలం 21 మంది విద్యార్థులు ఉన్నారు.

ఇక్కడ పరిస్థితిని ఆరా తీస్తే.... ఇక్కడ పని చేసే వార్డెన్ ఏడాది క్రితం లాస్ ఆఫ్ పే పై సెలవు పెట్టి వెళ్లారు. అప్పటి నుంచి రేపల్లెకు చెందిన వార్డెన్‌కు వేమూరు హాస్టల్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆమె రోజు డ్యూటీకి రారు. ఎఫ్ఎఎస్‌సి ఆర్డర్ లేకుండానే పైఅధికారులు ఆమెకు మౌఖిక ఆదేశంతో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ విధంగా బాధ్యతలు ఇచ్చినప్పటికీ అవి కేవలం ఒక నెల రోజులు మాత్రమే ఉపయోగపడతాయి. తరువాత పరిస్థితిని బట్టి తప్పనిసరిగా ఆర్డర్ పైనే ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలి. అది ఏడాది గడిచినా కూడా జరగలేదు. ఇన్‌చార్జి వార్డెన్ వారంలో ఎప్పుడు వచ్చి ఎంతసేపు ఉండి వెళ్లారు ఎవరికి తెలియదు. ఇక్కడ హాస్టల్ పర్యవేక్షణ బాధ్యతలన్ని ఆయానే చూస్తారు. అంతే కాకుండా రేపల్లె ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ పూర్తి బాధ్యతలతో పని చేసే వార్డెన్‌కు రేపల్లెలోని ప్రీ హాస్టల్ బాధ్యతలను అదనంగా అప్పగించారు. రెండు హాస్టల్స్ బాధ్యతలు స్వీకరించిన ఆమెకు తిరిగి వేమూరు హాస్టల్ బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో ఆమె రేపల్లెలో ఉన్న రెండు హాస్టల్స్ బాధ్యతలపైనే దృష్టి పెట్టి 30 కి.మీ దూరంలో ఉన్న వేమూరు హాస్టల్‌పై మాత్రం అంత బాధ్యతగా వ్యవహరించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్‌కు బాధ్యతలు అప్పగించిన పైఅధికారులు వేమూరు హాస్టల్ పరిస్థితిపై మాత్రం పర్యవేక్షణ లేకుండా వ్యవహరిస్తున్నారు. హాస్టల్ గ్రౌండ్‌లోనే మండల విద్యాశాఖాధికారి కార్యాలయం కూడా ఉంది. కనీసం సంబంధిత అధికారి కూడా హాస్టల్ వైపు కన్నెత్తి చూడరు. ఇక్కడ విద్యార్థుల పరిస్థితులను గురించి పట్టించుకునే వారే లేరు. ఇతర గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఎవరు బాధ్యులని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వేమూరు హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌ను నియమించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాధ్యత పెరిగి న్యాయం చేయలేకపోతున్నా...

హాస్టల్ తీరుపై వార్డెన్ వనితను ప్రశ్నించగా తనకు మూడు హాస్టల్స్‌పై బాధ్యత పెట్టడం వల్ల దూరంలో ఉన్న వేమూరు హాస్టల్‌కు న్యాయం చేయలేకపోతున్నానని సమాధానం ఇచ్చారు. పై అధికారులకు వేమూరు ఇన్‌చార్జి బాధ్యతలను తొలగించాలని ఏడాది నుంచి కోరుతున్నప్పటికీ ఏ ఒక్కరూ స్పందించడం లేదని అన్నారు. వారానికి ఒకటి రెండు రోజులు ఏదో ఒక సమయంలో వేమూరు హాస్టల్‌కి వచ్చి ఆయాకు బాధ్యతలు అప్పగించి రావడం జరుగుతుందని తెలిపారు.



గెలుపొందిన డీసీ లీలసత్యసాయి, నీటి సంఘాల అధ్యక్షులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

గెలుపొందిన నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులకు సన్మానం

అమృతలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన వారికి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కూచిపూడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొరటాల లీలసత్యసాయి, మండల పరిధిలోని 7 నీటి సంఘాల అధ్యక్షులు ఎల్‌జి ఛానల్, యలవర్తి రఘుబాబు, గంగాయి చానల్ గోవాడ రామాంజనేయులు, మూల్పూరు చానల్ మొవ్వా ప్రభాకరరావు, గుళ్ళపల్లి చానల్ కావూరి సత్యనారాయణ, ఇంటూరు చానల్ బోరుగడ్డ శామ్యూల్, సంగుపాలెం కోడూరు చానల్ కొనికి నాగేశ్వరరావు, మోపర్రు చానల్ ఆళ్ళ శ్రీనివాసరావులతో పాటు ఆయా సంఘాలకు చెందిన 70 మంది సభ్యులను మండల టీడీపీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణ సమస్యలపై దృష్టి సారించి రైతులకు మేలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, క్రొత్తపల్లి రవీంద్రబాబు, కొసరాజు దేవకుమార్, పాములపాటి వెంకటసుబ్బారావు, అచ్చన వెంకటేశ్వరరావు, నార్ల శ్రీనివాసరావు, మ్యాథ్యూస్, తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, ఉడతా దేవేంద్రబాలాజీ, పావులూరి హేమచంద్, మొవ్వా శ్రీనివాసరావు, లాం హరినాద్‌బాబు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- జిల్లా జడ్జి వైవీఎస్‌వీజీ పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి

రేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఖైదీలుగా మారిన మీరు సత్ప్రవర్తనతో నడుచుకుని మీ కుటుంబాలకు అండగా నిలవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి వైవీఎస్‌వీజీ పార్థసారథి అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను ఆదివారం ఆయన సందర్శించి ఖైదీల సౌకర్యాలు, ఆహార సదుపాయాలు, మెడికల్ సదుపాయలు, లీగల్ ఎయిడెడ్ సౌకర్యాలు, వారి కేసుల వివరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయవ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్షణికావేశానికి గురైతే కుటుంబాల్లో ఆనందాన్ని కోల్పోతారని, ఇకనుంచైనా సత్ప్రవర్తనతో మెలిగి వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, కె.వాణి, జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందిస్తున్న శివప్రసాద్

రేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైద్యం చేయించుకోలేని పేద ప్రజలకు అండగా ఉండేందుకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారని ఆయన సోదరుడు శివప్రసాద్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నలుగురికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షల 26 వేల చెక్కులను బాధితులకు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజల వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌ను అందిస్తూ అండగా నిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగమల్లి, జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా విజ్ఞాన న్యాయ అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా విజ్ఞాన న్యాయ సదస్సును పిట్టలవానిపాలెం చందోలు జలవనరులశాఖ కార్యాలయంలోని ప్రభుత్వ బంగ్లాలో ఆదివారం నిర్వహించారు. ఈ న్యాయ సదస్సుకు న్యాయవాది కె.కాళిదాసు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి పాల్గొని మాట్లాడుతూ గృహహింస, మానవ అక్రమ రవాణ, పోక్సో చట్టం, లోక్ అదాలత్, బాల్య వివాహాల నిషేధం తదితర చట్టాలపై మండలంలోని మహిళా పోలీసులు, అంగనవాడీలు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ఏఎన్ఎంలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఝాన్సీ లీగల్ వలంటరీ పఠాన్ మహ్మద్‌ఖాన్, ఖాజీపాలెం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.రాధ, ఏపీఎం సంతోష్‌కుమార్, చందోలు ఏఎస్‌ఐ డేవిడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రమాదబీమా



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నేత మురళీకృష్ణ తదితరులు

కొల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో ప్రమాదబీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ అన్నారు. ఆదివారం కొల్లూరులోని ప్రముఖ బిల్డర్, గృహలక్ష్మి కన్‌స్ట్రక్షన్ అధినేత తుమాటి శ్యాంబాబు, ఆయన కుటుంబ సభ్యులు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ, తనతో పాటు మరో 300 మంది టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించనున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు వల్ల సభ్యులకు రూ.5 లక్షల భీమా సౌకర్యాన్ని పార్టీ కల్పించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యడ్ల శ్రీనివాస్, కొమ్ము తులామాను, గుమ్మడి శ్రీనివాసరావు, దాసరి బుచ్చిరాజు, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్

రేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేది లేదని నగరం ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం దిండి అదవల పంచాయతీల్లో నాటుసారా స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు చోట్ల నాటుసారా తయారీ కోసం ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేసి వస్తువులను స్వాధీనపరుచుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది కె.శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యాపారాలు దండి

- శింగరకొండ ఆదాయానికి గండి
- పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు
- దేవస్థాన అధికారుల ఉదాసీనత

అద్దంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలో ప్రైవేటు వ్యాపారుల జోరు పెరగడంతో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఆదాయానికి గండి పడుతుంది. దాతల సహకారంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెలకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రైవేటు వ్యాపారులు ఏడాదికేడాది పెరిగిపోతున్నారు. దేవస్థానానికి అద్దెలు చెల్లించి వ్యాపారులు డజను మంది అయితే రోడ్లపై తోపుడుబండ్లు, చిన్న దుకాణాలు పెట్టుకొని వ్యాపారాలు చేసే వారు సుమారు 30 మందికి పైగానే ఉన్నారు. దీంతో లక్షల రూపాయల అద్దెలు చెల్లించి దేవస్థానం షాపులలో వ్యాపారాలు చేసుకునేందుకు వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. దేవస్థానం అధికారులు మరింత ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ప్రైవేటు వ్యాపారుల సంఖ్య మరింత పెరుగుతోంది. ఎలాంటి అద్దెలను చెల్లించేది లేక పోవడంతో దేవస్థానంలో షాపుల కంటే పూజా సామగ్రి ధరలు ఒకింత తగ్గించి అమ్మకాలు చేస్తుండడంతో భక్తులు కూడా ప్రైవేటు వ్యాపారుల వద్దనే కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో దేవస్థానం షాపులలో దుకాణాలు నిర్వహించే వ్యాపారుల వ్యాపారం మరింత తగ్గి పరోక్షంగా దేవస్థానం ఆదాయానికి గండి పడుతుంది. దాతల సహకారంతో ఇటీవల నిర్మించిన దేవస్థానం షాపులు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో కొన్ని ఇంకా ఖాళీగా ఉన్నాయి. ప్రైవేటు వ్యాపారుల మధ్య పోటీతత్వంతో ఇటీవల ప్రైవేటు వ్యాపారుల మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతుంది. ఆర్టీసీ బస్సులు కూడా కొన్ని సమయాలలో నిలిచిపోతున్నాయి. ప్రధానంగా మంగళ, శని, ఆదివారం, ప్రత్యేక పండుగల రోజులలో రద్దీ మరింత ఎక్కువగా ఉండి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు గ్రామస్థాయి నేతల అండదండలు ఉండడంతో దేవస్థానం అధికారులు కూడా తమకెందుకులే అన్న ధోరణితో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు స్పందించి ప్రైవేటు వ్యాపారాలు జరగకుండా చర్యలు తీసుకొని, దేవస్థానం ఆదాయం పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


దేవాలయం వద్ద రోడ్డుపై తోపుడు బండ్లు, ప్రైవేటు వ్యాపారుల దుకాణాలు

ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం పరిసర ప్రాంతం లో ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. దేవస్థానం ఆదాయం తగ్గడంతో పాటు, భక్తులకు మరింత ఇబ్బందిగా మారింది. వ్యాపారాలు నిర్వహించేందుకు ఉత్సాహం ఉన్న వ్యక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న షాపులను టెండర్ ద్వారా కేటాయించడం జరుగుతుంది.

- తిమ్మానాయుడు, ఈవో, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం

లక్ష తులసి..బిల్వార్చన


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

వేటపాలెం(చీరాల), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రావూరిపేటలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్లకు ఆదివారం లక్ష తులసి, లక్ష బిల్వ పత్రాలతో మహా అర్చన నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

హిందూ ఆలయాలను రక్షించుకుందాం

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఆలయాల పరిరక్షణ కోసం తలపెట్టిన హైందవ శంఖారావం సదస్సుకు ప్రజలు తరలిరావాలని హిందూ ధర్మ పరిషత్ సభ్యులు పోలిశెట్టి హరిబాబు, కుక్కల నాగమల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ముప్పవరం గ్రామంలో వీహెచ్‌పీ ప్రతినిధులు విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సదస్సుకు ప్రజలు భారీగా తరలిరావాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గరిమిడి జగన్మోహనరావు, ధూళిపాళ్ల భావనారయణస్వామి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఉల్లాస్ ట్రస్ట్ ప్రోత్సాహం అభినందనీయం

అద్దంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ఉల్లాస్ ట్రస్ట్ ప్రోత్సాహం అభినందనీ యమని ఎంఈఓ 2 సుధాకరరావు, ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం, చక్రాయపాలెం, పట్టణంలోని కాకానిపాలెం, గొరకాయపాలెం హైస్కూల్స్, ప్రకాశం ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం హైస్కూల్‌లలో 9, 10 తరగతులు చదువుతున్న 60 మందికి రూ.60వేల ప్రోత్సాహక నగదు, సర్టిఫికెట్‌లను ఎంఈవో సుధాకరరావు, ఎస్సై ఖాదర్‌బాషా అందజేశారు. రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు గ్రహీత చక్రాయపాలెం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న అడుసుమల్లి అనిల్‌కుమార్ రూ.25 వేల చెక్కును శ్రీనివాసరావుకు అందజేశారు. గోపు నారాయణ గుప్తా చక్రాయపాలెం హైస్కూల్‌కు రూ.5వేలను, గ్రంథాలయ సాధన కమిటీకి మానికొండ రవిశంకర్ రూ.2వేలు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధులు మానం రవిశంకర్, మానం రాము, ధనుంజయ్, ఆయా హైస్కూల్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కొండయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఐక్యతతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే కొండయ్య పిలుపు

చీరాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలమని, అందరం కలసికట్టుగా ప్రయాణం చేస్తూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిబాటలో నడిపిద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని దేవాంగపురి శ్రీ చౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపంలో బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం తృతీయ నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం దేవాంగ సామాజికవర్గ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై ఆయన మాట్లాడారు. పరస్పర సహకారంతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. నిర్వాహకులు ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాంగ ప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ గోశాలలో ..

పాపరాజుతోట శ్రీ కృష్ణ గోశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమాలో ఎమ్మెల్యే కొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. గోశాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గోశాల ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

కొత్తపేట(చీరాల), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలు అందించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తాజాగా నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇతర కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల బాధ్యులు ఎమ్మెల్యే కొండయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. పదవల్లో ఉన్న మనపై ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతగా పనిచేయాలని కొండయ్య సూచించారు. ప్రభుత్వ పరంగాను, వ్యక్తిగతంగాను తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘాల బాధ్యులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో చినగంజాం అభివృద్ధి

చినగంజాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో చినగంజాం మండల అభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబుతో కలిసి ఆదివారం రాత్రి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్య ఫలాలను అందించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. చినగంజాం మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు. ఓడల తయారీ పరిశ్రమకు, పోర్టు నిర్మాణానికి కృషికి చేస్తున్నట్లు తెలిపారు. మండలాన్ని టూరిజం హబ్‌గా, పరిశ్రమల హబ్‌గా రూపొందించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం చర్చి ఆవరణలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు విక్రం వెంకటరావు, నక్కల వెంకటనారాయణ, ఎన్‌వీ రాఘవులు, వీరాస్వామి, డి.నాగరాజు, కత్తి లాజర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్‌లు ధరించాలి

చీరాలటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు విధిగా హెల్మెట్‌లను ధరించాలని చీరాల వన్‌టౌన్ సీఐ మారీదు శ్రీనివాసరావు అన్నారు. సీఐ ఆధ్వర్యంలో పట్టణ పురవీధులలో పోలీసులు హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడిపి అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎస్సైలు భాస్కరరావు, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్సై పవన్ కుమార్ తదితర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : హెల్మెట్ ఆవశ్యకతపై సీఐ కే వెంకట్రావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ పట్టాభిరామయ్య, బల్లికురవ ఎస్ఐ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నా పీడీ పోస్టు లేదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులకు పీడీ ఉన్నా ఆట స్థలం లేదు. ప్రాంగణంలో టైల్స్ వేయడంతో దానిపై ఇసుక పోసి మొక్కుబడిగా ఆటలు ఆడిస్తున్నారు.

- చీరాల నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. అయితే ఆయా కళాశాలల్లో ఆటస్థలాల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ విద్యార్థులకు ఆటలకు అవకాశం లేకుండా పోయింది.

- వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1979-80లో ప్రారంభించగా అప్పటి నుంచి పీడీ పోస్టు లేదు. దీంతో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి ఉన్నా ఆటలు ఆడించే వారు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. పీడీ పోస్టు లేకపోవడంతో క్రీడలకు చెందిన ఎలాంటి వస్తువులు కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కావడంలేదు. రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడేళ్ల క్రితం పీడీ ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. కళాశాలలో పెద్ద క్రీడా మైదానం ఉన్నా 150 మంది విద్యార్థులకు క్రీడలు నేర్పించే పరిస్థితి లేదు. కనీసం ఆటలు ఆడుకునే పరికరాలు కూడా లేవు. కళాశాల ప్రాంగణంలో 2022లో అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన చేయగా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. బేస్‌మెంట్, చుట్టూ ఐరన్ పిల్లర్స్, పైన కప్పు వేశారే తప్ప కింద భాగంలో కాంక్రీట్ వేయలేదు. ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీటి పైప్ లైన్లు వెయ్యాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఇండోర్ స్టేడియం పనులు నిలిపివేశారు. మాచర్లలో ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం ఉండగా ఆట పరికరాలు, పీడీ లేరు. దుర్గిలోని జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం లేదు. పీడీ లేరు. వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదేళ్ల నుంచి పీడీ పోస్టు భర్తీకి నోచుకోలేదు. విశాలమైన గ్రౌండ్ ఉంది. దీంతో కళాశాలలోని 450 మంది విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపలేకపోతున్నారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం సక్రమంగా లేదు. పీఈటీ ఉన్నారు. దీంతో విద్యార్థులకు క్రీడా అవకాశాలు కోల్పోతున్నారు. మోడల్ స్కూల్‌లో కాంట్రాక్టుపై పీఈటీ ఉన్నా ఆట స్థలాలు లేవు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం అధ్వానంగా ఉంది. పిచ్చి చెట్లు, గుంతలతో నిండి ఉన్న మైదానంలో విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేదు. పీడీ పోస్టు ఉన్నా అవసరమైన క్రీడా పరికరాలు లేవు. మైదానం అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్, పీడీలు ఇటీవల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. పిడుగురాళ్ల, గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాలు అధ్వానంగా ఉన్నాయి. కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. దాచేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం లేదు. పీడీ పోస్టు ఖాళీగా ఉంది. క్రీడా పరికరాలు ఉన్నా వినియోగించే వీలులేక బీరువాలో భద్రంగా ఉన్నాయి. పొన్నూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సౌకర్యాలతో పాటు పీడీ పోస్టు ఏళ్లుగా భర్తీ కాలేదు. వెల్లటూరులోని జూనియర్ కళాశాలలో క్రీడలకు అవసరమైన ప్రాంగణం లేదు. పీడీ పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. అదే ప్రాంగణంలోని హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు క్రీడల శిక్షణ ఇస్తున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని జూనియర్ కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.


సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏలూరి, రాము

సుబ్బారావుకు ఎమ్మెల్యేల నివాళి

హాజరైన ఏలూరి, రాము, గౌతు శిరీష కుంటుంబ సభ్యులు

చిన్ననందిపాడు (పర్చూరు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలం చిన్ననందిపాడు గ్రామానికి చెందిన ముప్పా సుబ్బారావు దశ దినకర్మ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, గుడివాడ ఎమ్మెల్యే వెణిగళ్ల రాము, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబ సభ్యులు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష భర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, సర్పంచ్ ముప్పా వెంకట శివరావు, ముప్పా నాగేశ్వరరావు, ముప్పా రవికిరణ్, లోకేంద్ర, కొమ్మాలపాటి పున్నారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సీఎం రిలీఫ్ పండ్ నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మార్టూరు మండలం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో 41 మందికి మంజూరైన రూ.39,39,567లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఏలూరి అభినందనలు

నెల్లూరు జిల్లాలో క్రీడల సమాఖ్య అధ్వర్యంలో నిర్వహించిన చెవిటి, మూగ బధిరుల క్రికెట్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు ఆదివారం మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేంగా అభినంచారు.

కవి కాసల సేవలు విశిష్టమైనవి


కాసలకు పురస్కారాన్ని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్యం, గేయం, వచన వంటి విభిన్న ప్రక్రియల్లో సాధికారమైన పట్టు కలిగిన కవి డాక్టర్ కాసల నాగభూషణం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఇందిరానగర్‌లోని పుట్టంరాజు కళా క్షేత్రంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట సాహిత్య పురస్కార సభ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అముక్తమాల్యాదకు కాసల చేసిన సరళవచనామ వాదం ప్రసిద్ధమైనదన్నారు. అముక్తమాల్యాద ఒక ప్రౌఢకావ్యమని, ఈ కావ్యాన్ని సులభశైలిలో సరళవచనామవాదం చేసిన కాసల తెలుగు భాషకు గొప్ప సేవ చేశారన్నారు. ఆ కావ్యాంలోని విశేషాలను నేటితరం ఆ కళింపు చేసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. డాక్టర్ కాసల రాసిన తిక్కన సీత-తులనాత్మక పరిశీలన అనే గ్రంథం, రామాయణాలు-సీత ప్రాతచిత్రణ అనే అంశంపై జరిగిన ఒక మంచి గ్రంథం అన్నారు. అనంతరం పట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలతో పాటు సభ్యులు డాక్టర్ కాసలకు అందజేశారు. కార్యక్రమంలో పద్య కవి డీవీఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేషధరశర్మ, వారణాసి రఘురామశర్మ, చప్పిడి వీరయ్య, గాడేపల్లి దివాకర్‌దత్తు, అనంత రామకోటేశ్వరరావు, సుబ్బయ్య, మస్తాన్, సాయి, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

అనుమతి కొంత .. అదనపు నిర్మాణం మరికొంత

- చీరాల ఆర్టీసీ డిపో ప్రాంగణంలో కట్టడంపై సర్వత్రా విమర్శలు
- జీ ప్లస్ వన్‌కు కేటాయించే స్థలంలో జీ ప్లస్ టూ పనులు
- తొలగించాలని డీఎం నోటీసులు
- ఒడా నుంచి మంజూరు కాని అనుమతులు


చీరాల ఆర్టీసీ ప్రాంగణంలో అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణం

చీరాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టటం హర్షనీయం. అయితే సదరు చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ ఇచ్చిన అనుమతికి మించి చేపడుతున్న నిర్మాణంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ ప్రాంగణంలో 23 సెంట్ల ఖాళీ స్థలంలో జీ ప్లస్ వన్ నిర్మాణం చేపట్టి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు టెండరు ద్వారా లీజుదారుకు అనుమతి ఇచ్చారు. నెలకు రూ.1,80,000 అద్దె, అందుకుగాను రూ.30,000 జీఎస్టీతో కలిపి నెలకు రూ.2,10,000 చెల్లించేలా అనుమతులు ఇచ్చారు. లీజు కాలపరిమితి 15 సంవత్సరాలు. అయితే సదరు లీజుదారుడు అద్దె ప్రాతిపదికలోని నిబంధనల మేరకు జీ ప్లస్ వన్ మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి. అయితే జీ ప్లస్ టూకు కూడా ఇనుప ట్రస్‌లతో నిర్మాణ పనులు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నిర్మాణ పనులపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పార్టీల ప్రస్తావన వస్తోంది. రాజకీయ కోణంలో విశ్లేషణలు జరుగుతున్నాయి. వాటిమాట ఎలా ఉన్నా అద్దె ప్రాతిపదికన ఇచ్చే క్రమంలో ఆర్టీసీ ఏ నిబంధనలు ఉన్నవో వాటిని అమలు పరిస్తే ఎలాంటి సమస్యలుండవు. లేదంటే ఒక వైపు ఆర్టీసీ ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉండడంతో పాటు భవిష్యత్‌లో మరికొన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని విషయం తెలిసినవారు అంటున్నారు.

అదనపు నిర్మాణాలను తొలగించాలని నోటీసులిచ్చాం

ఆర్టీసీ ప్రాంగణంలో 23 సెంట్ల స్థలంలో నిర్మాణాలకు, వ్యాపార నిర్వహణకు అద్దె ప్రాతిపదికన ఇచ్చాం. జీ ప్లస్ వన్‌కు మాత్రమే అనుమతిచ్చాం. లీజుదారుడు జీ ప్లస్ టూకి ఇనుప కమ్మిలతో నిర్మాణ ప్రక్రియ చేపట్టారు. అవి తొలగించాలని నోటీసు ఇచ్చాం. నిబంధనల మేరకు అద్దె నెలకు రూ.1,80,000, అందుకుగాను రూ.30 వేలు జీఎస్టీ, మొత్తం నెలకు రూ.2,10,000 చెల్లించాలి. 15ఏళ్ల కాలపరిమితి. సుమారు ఆరు నెలల క్రితం అగ్రిమెంట్ జరిగింది. అదనపు నిర్మాణాలను అనుమతించం.

- శ్యామల, మేనేజర్, ఆర్టీసీ చీరాల డిపో

నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణం చేపట్టాలి

ఆర్టీసీ ప్రాంగణంలో లీజుకు తీసుకున్న ప్రదేశంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించాం. నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని చెప్పాం. అతిక్రమిస్తే ఉన్న నిబంధనల మేరకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

- శ్రీనివాసరావు, టీపీవో, చీరాల మున్సిపాలిటీ

సపోర్ట్ డాక్యుమెంట్స్ అడిగాం .. వాటిని దాఖలు చేయాల్సి ఉంది

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చేపడుతున్న నిర్మాణానికి సంబంధించి అనుమతుల కోసం దాఖలు చేసిన పత్రాలు పూర్తి స్థాయిలో సరిపోలేదు. పూర్తి సమాచారం కోసం సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి పంపాలని చెప్పాం. లేదంటే అసలు నిర్మాణం, అదనపు నిర్మాణానికి సంబంధించి నిబంధనల మేరకు చర్యలు ఉంటాయి.

- బాబూరావు, ఒడా ప్లానింగ్ ఆఫీసర్, ఒంగోలు

వైభవంగా సీతారామస్వామి దేవస్థాన పునర్ నిర్మాణ పూజలు


సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

చినగంజాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానం పునర్ నిర్మాణ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు వంద సంవత్సరాల చరిత్ర గల సీతారామసామి దేవస్థానంలో నిత్య, నైవేద్యాలు జరుగక మూత పడి ఉండడంతో గ్రామస్థులు పునర్ నిర్మాణానికి సంకల్పించారు. ఆగమశాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి విష్వక్సేనారాధనము, పుణ్యాహ్యవచనం, వాస్తుపూజ, పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ అనంతరం అగ్నిప్రతిష్ఠాపనము, శాంతి హోమం, పూర్ణాహుతి, కూష్మాండబలి తదితర పూజలను నిర్వహించారు. అనంతరం దేవాలయ ద్వార బంధంను, సింహద్వారమును తెరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వారాలు తెరిచి దేవస్థానంలో పూజలు చేశారు. పూజలు అనంతరం భక్తులు రాములోరిని దర్శించుకున్నారు. దేవస్థానంలోని విగ్రహాలను స్థానిక భూ సమేత భావనారాయణ స్వామి దేవస్థానికి తరలించారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మోటుమర్రి రామ సుబ్బారావు, పలివేటి వెంకటరామానుజంలు తెలిపారు. నూతనముగా ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించడం జరుగుతుందని తెలిపారు. దేవస్థానం ప్రాంగణం భక్తుల జై శ్రీరామ్ నామ స్మరణంతో మారుమోగిపోయింది. భక్తులకు తీర్థప్రసాదాలను వినిమోగం చేశారు. దేవదాయ శాఖ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ నేత రాధాకృష్ణకు పరామర్శ

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తెలగతోటి రాధాకృష్ణమూర్తిని పలువురు నేతలు ఆదివారం పరామర్శించారు. రాధాకృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. నూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వేమా శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, ఒంగోలు 33వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి జగన్నాథం, మురళీమోహన్ పరామర్శించారు.

వృద్ధులకు నూతన వస్త్రాల అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్‌సీ 1989-90 పదివ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సేవా స్ఫూర్తి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు వృద్ధులకు నూతన దుస్తులను అందజేశారు. ఈ క్రమంలో సింగరకొండలోని రామమందిరంలోని వృద్ధులకు, కష్టజీవుల సేవా సంఘం వృద్ధాశ్రమంలో 75 మంది వృద్ధులకు క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వస్త్రాలను అందజేసినట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు తెలిపారు.

తిరుమల సైకిల్ యాత్రకు సంఘీభావం

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుంటూరుకు చెందిన శ్రావణి హాస్పటల్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు వారి మిత్ర బృందం తిరుమలకు చేపట్టిన సైకిల్ యాత్రకు పంగులూరు గ్రామ వాసులు సంఘీభావం తెలిపారు. గుంటూరుకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణుడు శ్రీనివాసరావు మిత్ర బృందం తిరుమలకు చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం పంగులూరు మండలంలోకి చేరింది. గ్యాస్ట్రాలజీపై అవగాహన కోసం మూడేళ్లుగా సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండమంజులూరు అడ్డరోడ్డువద్ద సైకిల్ యాత్రకు నాయకత్వం వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావుకు ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ వెంకటరావు పూలమాల వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.